# బహుమతి గ్రహీత

జి. భవానీరమణ

(గత సంచిక తరువాయి)

ప్రాంగణంలో ఉమ్మేసినా పటేలును రాఘవయ్య ఎందుకు ఏమీ అనలేదో, స్టాఫంతా పటేలుకి నమస్కారాలు ఎందుకు పెట్టారో నాకప్పుడర్థమైంది. నిజానికి ఇలాంటివి నాకు ఇష్టం ఉండవు. కానీ వద్దు పొమ్మంటే స్టాఫ్ నుండి పనికి సంబంధించిన సహకారం దెబ్బ తింటుందని నాకు తెలుసు. అందుకని కిమ్మనకుండా ఊరుకున్నాను. కాసేపు లోకాభిరామాయణం మాట్లాడి, తన ఖాతాలో కొంత డబ్బు జమ చేసి వెళ్ళిపోయాడు పటేల్.

రాఘవయ్యని పిలిచి, నా కోసం ప్రత్యేకంగా ఏమీ ఉంచుకోకుండా ద్రాక్షపళ్లని స్టాఫందరికీ సమంగా పంచెయ్యమని చెప్పాను. ఇటువంటి పనులంటే అతడికి చాలా ఉత్సాహం.

ఎంత వద్దనుకున్నా గోడవారగా పటేలు ఉమ్మెయ్యడం రెండు నిముషాలకోసారి జ్ఞాపకం వచ్చి, అసహ్యం వేస్తోంది, కళ్లు మూసినా, తెరిచినా అదే దృశ్యం మెదలుతోంది. కిశోర్‌ని క్యాబిన్‌కి పిలిపించి, పుల్లయ్యమీద కంప్లైంట్ చేశాను. "నయానో, భయానో చెప్పి పుల్లయ్య చేత పని చేయిస్తానన్నారు గదా, రెండు రోజుల్లో నాకు బ్రాంచంతా శుభ్రంగా కనబడాలి. లేకుంటే పుల్లయ్య మీద నేను తీసుకోబోయే చర్యకి ఎవరేం చేసినా నేను వెనక్కి తగ్గదల్చుకోలేదు" అన్నాను కఠినంగా.

"మరీ అంత అర్జంటైతే బయటి పనివాళ్లెవరినైనా మాట్లాడి బాగు చేయిద్దాం సార్. మీ ముందు మేనేజరుగారు అలాగే చేసేవారు. పుల్లయ్య కొంచెం మొండివాడన్నమాట నిజమే అనుకోండి, కానీ సమస్యని జటిలం చేస్తే, రేపు మా సెంట్రల్ కమిటీ వాళ్లూ, మిగతా సభ్యులూ ఇందులో తలదూర్చి, నిరసనలూ, ధర్నాలూ, స్ట్రైకుల వరకూ తీసుకువెళతారు, అప్పుడు పనులన్నీ స్తంభించి మీరు మరిన్ని కష్టాలు పడవలసి వస్తుంది" అన్నాడు కిశోర్.

"ఇలాంటి మాటలు నన్నేమీ బెదిరించలేవని తెలుసుకోండి మిస్టర్ కిశోర్, నాక్కావలసింది పని, సలహాలు కాదు!" కొంచెం అసహనంగా అన్నాను, "ఇక మీరు వెళ్లవచ్చు."

కిశోర్ కేబిన్నుంచీ నిష్క్రమిస్తుండగా ఫోన్ మోగింది.


"హల్లో!" అన్నాను ఫోనెత్తి, అవతల నుంచీ మాధవరావు.

మాధవరావుదీ, నాదీ ఒకే బ్యాచి. మా పొరుగూరి బ్రాంచికి మేనేజరుగా పని చేస్తున్నాడు మాధవరావు, "చెప్పు మాధవా, ఏమిటి విశేషాలు?" అడిగాను ఫోనులో.

"మన ఛైర్మన్ కపూర్ గారు వచ్చేవారం మన బ్రాంచీలు చూడడానికి వస్తున్నారు తెలుసా?" అడిగాడు మాధవరావు.

"తెలీదే?"

"అయితే జాగ్రత్త. కపూర్‌గారు కొంచెం చిత్రమైన వ్యక్తిత్వం గల మనిషి, పైగా చాలా డైనమిక్. ఆయన ఆలోచనలు చాలా సృజనాత్మకంగా కూడా ఉంటూ ఉంటాయి. ఆయన మన బ్యాంక్ ఛైర్మన్ కాకముందు, నేను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మా కాలనీలోనే ఉండేవారు. ఆ విధంగా ఆయన నాకు కొంత పర్సనల్‌గా కూడా తెలుసు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, మనం బ్యాంకులో ఖాతాలూ, రికార్డులూ ఎంత జాగ్రత్తగా మెయిన్‌టైయిన్ చేస్తామో, అంత కన్నా బాగా మన పరిసరాల పరిశుభ్రత పాటించాలంటారాయన. పరిశుభ్రతకి ప్రాణం ఇచ్చేస్తారాయన. అంతటా శుభ్రంగా ఉందో, లేదో తెలుసుకోవడానికి, స్వయంగా రాక్‌లలో పుస్తకాలూ అవీ కూడా బయటికి లాగి చూడటం, టాయిలెట్లని కూడా సందర్శించి పరిశీలించటం చేస్తారాయన. ఎక్కడయినా దొరికిపోయామో, అప్పటికప్పుడు మన మీద ఛార్జి షీటు దాఖలు చేయించేస్తారు. అయితే ఆయనలో ఇంకో గొప్ప గుణం ఏమిటంటే, ఆయనకి పని నచ్చితే అప్పటికప్పుడే బహుమతులు ప్రకటించి, స్టాఫ్ మీటింగులలో



ఏర్పాటు చేయించి, చిన్న సైజు సన్మానాలు కూడా నిర్వహించేస్తుంటారు. మొన్నటికి మొన్న కరీంనగర్ బ్రాంచి సందర్శించినప్పుడు, అక్కడి మేనేజర్ మన నాగేశ్వరరావు లేడూ, వాడికి పదివేల రూపాయల బహుమతి ప్రకటించి, బ్యాంక్ అకౌంట్ డెబిట్ చేసి ఇచ్చి, అప్పటికప్పుడు సన్మానం చేసి వెళ్లారు. కనుక మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది, బహుమతులు రాకపోయినా, ఛార్జి షీట్లు రాకుండా చూసుకోవాలి కదా!" అంటూ ఛైర్మన్ గారి గురించి చాలా విషయాలు చెప్పాడు మాధవరావు.

ఇది జరిగాక బ్రాంచి పరిసరాలన్నీ నన్ను వెక్కిరిస్తున్నట్లనిపించి, బుర్ర వేడెక్కి పోయింది. ఎలాగైనా పుల్లయ్య చేతే ఇదంతా బాగు చేయించాలన్న కసి కలిగింది. నాకు పవర్స్ లేవు గానీ, ఉంటే తక్షణం పుల్లయ్యని ఉద్యోగం లోంచి పీకి పారేసేవాణ్ని!


నేను మెమో ఇస్తానని భయపడ్డాడో, లేక పని చేయాల్సొస్తుందని భయపడ్డాడో తెలీదు కానీ, ఒంట్లో బాగోలేదంటూ వర్తమానం పంపి, మర్నాటి నుండి పుల్లయ్య లీవు పెట్టేశాడు.

ఛైర్మన్‌గారు రెండు రోజుల్లో వస్తున్నట్లు మాధవరావు చెప్పినట్లుగానే వర్తమానం అందింది. ఇక గత్యంతరం లేక రాఘవయ్యని పిలిచి, బ్రాంచిని శుభ్రపరచడానికి ఎవరినైనా పనివాణ్ని పట్టుకురమ్మని పంపాను. నా ముందు మేనేజరు ఇలాగే బయటివాళ్లకి డబ్బిచ్చి పరిసరాలు శుభ్రపరిపిస్తుంటే, మా రీజనల్ ఆఫీసు వాళ్లు ఆయన్ని చివాట్లు పెట్టారు. అందుకే కొన్ని సార్లు ఆ ఖర్చుకి తన స్వంత డబ్బుని ఉపయోగించేవాడు, కొన్ని సార్లు వేరే పద్దుల కింద లెక్క రాయించేవాడు.

గంట తిరిగేలోపు, రాఘవయ్య, వెంకయ్య అనేవాణ్ని పట్టుకొచ్చాడు.

"ఇతను బాగా చేస్తాడా?" అడిగాను రాఘవయ్యని.

"పుల్లయ్య లేనప్పుడల్లా ఇతడి చేతేసార్, మనం బ్రాంచినంతా క్లీన్ చేయించేది. వెంకయ్య చేశాడంటే బ్రాంచంతా తళతళలాడిపోవల్సిందే! మళ్లీ పదిహేను, ఇరవై రోజుల దాకా ఎక్కడా తుడవకపోయినా పరవాలేదు" అన్నాడు రాఘవయ్య.



"ఎంతివ్వమంటావు?" అడిగాను వెంకయ్యను బేరం కుదుర్చుకోవడానికన్నట్లు.

"ఆరొందలిప్పించండి బాబూ!" అన్నాడు వెంకయ్య.

ఒక్క రోజు క్లీనింగ్‌కి అంత డబ్బు డెబిట్ చేసే అధికారం నాకు లేదు, అందుకే "ఇంకో మాట చెప్పు" అన్నాను.

వెంకయ్య రాఘవయ్య వైపు చూశాడు.

"ప్రతి సారీ అంతే ఇస్తున్నారండీ!" అన్నాడు రాఘవయ్య.

"నాకు మూడు వందలకి మించి ఇచ్చే అధికారం లేదు, అంతకు చెయ్యగలిగితే చూడు" అన్నాను.

"అందులో పుల్లయ్యకి రెండొందలు పోతే, నాకు మిగిలేది వందే గదా, నా వల్ల కాదు బాబూ!" అన్నాడు వెంకయ్య, రాఘవయ్యతో.

"పుల్లయ్యకి రెండొందలు ఇవ్వడమేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"బ్యాంకు శుభ్రపరచడానికి బయటి వాళ్లెవరు వచ్చినా, వాళ్ల వెంటపడి వాళ్లకి ఇచ్చిన డబ్బు లోంచి కొంత అడిగి తీసుకోవడం పుల్లయ్య అలవాటండీ, వాడికి అలా ఇవ్వకపోతే, బ్యాంకులో మళ్లీ ఈ మాత్రం పని దొరకదేమోనని మేము చెప్పినా వినకుండా వీళ్లూ ఇచ్చేస్తుంటారండీ" చెప్పాడు రాఘవయ్య.

ఈ వెంకయ్యకు ఎవరి దగ్గర ఏమి మాట్లాడాలో తెలియకపోవడం వల్ల, పుల్లయ్యని గురించి ఓ విలువైన సమాచారం దొరికింది. దీని ఆధారంగా పుల్లయ్యని ఎలాగైనా ఇరికించవచ్చేమో ఆలోచించాలి అనుకుంటూ, వెంకయ్యతో బేరం కొనసాగించాను, పుల్లయ్యకి ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదని చెప్పాను. అయినా వాడు నాకన్నా పుల్లయ్యకే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తున్నట్టు కనిపించింది. చివరికి బేరం ఐదువందలకి కుదిరింది, మిగిలిన రెండు వందలూ నా జేబు నుండి వెచ్చించడానికి సిద్ధపడి అందుకు ఒప్పుకున్నాను.

డబ్బు ఖర్చయినా, రెండు రోజులు మా పనులు సవ్యంగా సాగకపోయినా, ఛైర్మన్ గారు వచ్చే సమయానికి వెంకయ్య మాత్రం బ్రాంచిని అద్దంలా తయారుచేశాడు, ఎక్కడా ఒక మరక గానీ, దుమ్ముగానీ లేదు.

ఆ సాయంత్రం మా ఛైర్మన్‌గారు రానే వచ్చారు, నేనే బయటివరకూ వెళ్లి ఆయన్ని సాదరంగా లోపలికి తీసుకువచ్చాను. ఆయన వెంట ఆయన పి.ఎ, మరో ముఖ్యమైన ఆఫీసరు కూడా వచ్చారు. లోపలికి వస్తూనే ఆయన బ్రాంచి అంతా కలయచూశారు. శుభ్రతకి సంబంధించిన అసంతృప్తి ఏదీ ఆయన మొహంలో కనబడకపోవడం, నాకు చాలా సంతోషాన్నీ, రిలీఫ్‌నీ ఇచ్చింది. తర్వాత ప్రతి సీటు దగ్గరికీ వచ్చి అక్కడి వారిని పరిచయం చేసుకుంటూ, అక్కడ జరిగే పనుల గురించి తెలుసుకుంటూ అక్కడక్కడా రికార్డులు చేతిలోకి తీసుకుని పరిశీలించారు. గత రెండు రోజులుగా 'పచ్చదనం—పరిశుభ్రత' కార్యక్రమం జోరుగా సాగుతుండడం వల్ల, కొన్ని రికార్డులు అప్టుడేటుగా లేవు. దానికి ఆయన నన్ను మెత్తమెత్తగా చివాట్లు వేశారు. అదయ్యాక స్టాఫ్ అందరినీ సమావేశపరిచి, చిన్న మీటింగు ప్రారంభించి, తనదైన ఫక్కీలో ఇలా ప్రసంగించారు, "మీ బ్రాంచి అంతా పరిశీలించాక నాకొక విషయం అర్థమైంది, ఇక్కడ మీ పార్ట్ టైం స్వీపర్ పని చేసినంత బాగా మీరెవ్వరూ పని చెయ్యడం లేదని, ఇంత బ్రాంచిని ఇలా అద్దంలా ఉంచగలిగాడూ అంటే, అతడు తప్పక గొప్ప శ్రమజీవి అని చెప్పుకోవచ్చు. అతడి సేవలకి గుర్తింపుగా అతడికి అయిదువేల రూపాయలు బహుమతి ప్రకటిస్తున్నాను. ఉదయం పనైపోయాక ఇంటికి వెళ్లి ఉంటాడు గనుక అతన్ని వెంటనే ఇక్కడికి పిలిపించండి, నా చేతుల మీదుగా బహుమతినిచ్చి, సన్మానించాలనుకుంటున్నాను".

నాకు కళ్లు తిరిగి పడిపోతున్నట్లనిపించింది, అయితే ఉన్న నిజమేమిటో ఆయనకి చెప్పడానికి నా నోట మాట రావటం లేదు, నిజం చెప్తే నా మేనేజిమెంటుని తప్పు బట్టి, ఇలా ఎందుకు చాశావని చార్జి షీటు ఇస్తారేమోనని భయం కూడా వేసింది. అయితే నా అదృష్టం కొద్దీ, అక్కడున్న మరెవరూ కూడా ఆయనకి నిజం చెప్పే ప్రయత్నం చెయ్యకపోవటం ,నాకొంత ఊరట నిచ్చింది. ఆ సమయంలో కొందరి పెదవులపైన చిరునవ్వు నాట్యం చెయ్యడం నా ఒక్కడికే కనబడింది.

ఛైర్మన్‌గారి ప్రసంగం తిరిగి కొనసాగించే లోపు నేను మా డ్రైవర్ని పిలిచి, బ్యాంకు కారు తీసుకువెళ్లి వెంటనే పుల్లయ్యని బ్రాంచికి తీసుకురమ్మని చెప్పిపంపాను. ఇరవై నిముషాల్లో పుల్లయ్య వచ్చేశాడు.

ఛైర్మన్‌గారి చేతుల మీదుగా అయిదు వేల రూపాయల బహుమతిని అందుకుంటున్న అతనికి చప్పట్లు కొట్టి అందరం జేజేలు పలికాం.